Daur-e-Nav ka Challenge
Aur Hamare Naujawan
(Telugu)

నవయుగం నవతరం

మూలం

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది

అనువాదం

ఇఖ్బాల్ అహ్మద్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ప్రియమైన యువకులారా!

ఈ ఇస్లామీయ విద్యార్థిసంఘ సమావేశంలో పాల్గొనడం నాకెంతో ఆనందాన్ని కలుగజేస్తోంది. గతాన్ని తలచుకొంటే, 28 ఏండ్ల క్రితం స్థాపించబడి నప్పుడు ఇది దేశంలో ఒక నిర్ణయాత్మక శక్తిగా రూపొందుతుంది అన్న ఆలోచనే రాలేదు. అసలు ఈ సంఘం దేశంలో ముందంజవేయగలదా? అన్న భావన, చాలా కాలం వరకూ నిరాశలో ముంచెత్తింది. కాని, కేవలం దైవానుగ్రహం, తోడ్పాటు వల్లనే ఈ కార్యం సాధించబడింది. దైవం యువకుల చిత్తశుద్ధిని ఆమోదించి వారి ఈ కృషిని సఫలీకృతం చేశాడు. వారికి ధైర్యాన్నీ, శక్తినీ ప్రసాదించాడు.

మీకు మరింత చిత్తశుద్ధిని ప్రసాదించమని, మరింత బలాన్ని చేకూర్చ మని, తన కారుణ్యంతో మరింత సహకరించమని, మీ చేతుల మీదుగా నూతన జాతి ఆవిర్భావానికి ఈ దేశంలో నాందీ ప్రస్తావన జరగాలని, ధర్మరాహిత్య, ధర్మవ్యతిరేక, నమ్మకద్రోహ మార్గాలు వదలిపెట్టి, సన్మార్గగాములై దైవభక్తి, దైవభీతి మార్గాలపై నడుస్తూ ఈ నవతరం తన స్వహస్తాలతో ఇక్కడ ఇస్లామీయ వ్యవస్థ స్థాపించగలగాలనీ దైవాన్ని ప్రార్థిస్తున్నాను.

ఆధునిక యుగపు సవాలు మరియు నవతరం అన్న అంశంపై ప్రసం గించవలసిందిగా సూచించడం జరిగింది.

ఈ విషయంలో మీరు మొదట అసలు ఆధునిక యుగం అంటే ఏమిటో ఆలోచించాలి. ప్రతికాలంలోనూ మానవుడు (సమకాలీన) తానున్న యుగాన్ని ఆధునిక యుగంగానూ అంతకు పూర్వం గడచిన యుగాలు అంధకార యుగాలనీ, వాటిలో ఎటువంటి అభివృద్ధీ సాధించబడలేదనీ, ఆ కాలపు ప్రజలు అజ్ఞానంలో పడివుండే వారనీ భావిస్తూవచ్చాడు. ఇంకా తాము ఆధునిక యుగంలో ఉన్న కారణంగా తాము విశాల భావాలు కలవారమని, కళా సాహిత్యాలలో ఆరితేరామనీ, పూర్వకాలంలోని వారికి లభ్యం కానటువంటి

జ్ఞానం తమకు దక్కిందనీ భావిస్తూ వచ్చాడు. అయితే వాస్తవానికి మానవాళి కోసం విజ్ఞాన ద్వారాలు తెరచుకున్న కారణంగా, తదాది జరిగిన శాస్త్రీయ పరిశోధనల్ని ప్రక్కకుబెడితే ఆదం(అలై) కాలం నుండి మానవుడిలో ఎటువంటి మార్పు కానరాదు. అతడి మేధస్సు నిర్మాణం అదే విధంగా జరిగింది. అతడి మస్తిష్క సామర్థ్యమూ అతడిలోని కోరికలు, అతడి శారీరక వాంఛలూ అవే, అతడి ఆలోచనా విధానమూ అదే. వీటిలో ప్రాథమిక మార్పు అంటూ ఏదీ జరగలేదు. ఎందుకంటే ఆదం(అలై) కాలంలో సాగిన ధోరణిలోనే మానవ సృష్టి ప్రక్రియ నేటికీ కొనసాగుతోంది.

ఈ కారణం చేతనే నాలుగువేల ఏళ్ళ క్రితం ఉదాహరణకు లూత్(అలై) జాతి ఏ బలహీనతకు లోనయ్యిందో, ఈ కారణం చేతనే తనకంటే అభివృద్ధి సాధించిన దేశం ప్రపంచంలో మరొకటి లేదు అని చెప్పుకునే అమెరికా వంటి అభివృద్ధి సాధించిన దేశంలో స్వలింగ సంపర్కుల సంఖ్య ప్రస్తుతం రెండు కోట్లు దాటుతోంది. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏముంది? అదేవిధంగా ప్రాచీన కాలంలో ఫిరౌన్ తన మంత్రితో తన కోసం ఒక పెద్ద కట్టడం నిర్మించమని, దాని పైకెక్కి మూసా దైవం ఎవరో, ఎలా వుంటాడో చూస్తాను అన్నాడట. ఆ తర్వాత మూడు, మూడున్నర వేల ఏళ్ళకు రష్యా వాళ్ళ స్పుత్నిక్ భూమికి రెండువందల యాభై మైళ్ల ఎత్తుకు ఎగిరివెళితే కృశ్చేవ్ మహాశయుడు అన్నాడట, "మేము పైదాకా వెళ్ళాం, దైవం ఎక్కడా లేడు." అంటే మూడున్నర వేల ఏళ్ళ పరిణామ క్రమంలో మానవుడి ఆలోచనా విధానంలో ఎటువంటి మార్పు రాలేదని తెలుస్తోంది. కాకపోతే ఈజిప్ట్‌కు చెందిన ఫిరౌన్ మహాఅయితే ఒక పెద్ద కట్టడాన్ని నిర్మించగలిగాడు. వీళ్ళేమో స్పుత్నిక్ నిర్మించి శూన్యంలోకి వెళ్ళారు. అంటే ఇది టెక్నాలజీ సాధించిన అభివృద్ధి తప్పితే మేధాపరంగా చెప్పుకోదగ్గ అభివృద్ధి మాత్రం కాదు. నాస్తికులు ప్రాచీన కాలంలో ఉండి ఉన్నట్లుగానే ఈనాడూ వున్నారు. అంటే మేలయినా కీడయినా, పాపమయినా పుణ్యమయినా నాడూ వున్నాయి, నేడూ వున్నాయి. మానవ వనరులు, సాధనాల అభివృద్ధి కారణంగా శాస్త్రీయ పరిశోధనలు, వాటిని నిజజీవితంలో ఆచరణలోకి

తెచ్చిన కారణంగా ఒకవేళ ఏదయినా వ్యత్యాసం ఉందీ అంటే అందుక్కారణం టెక్నాలజీకి సంబంధించిన వ్యత్యాసం మాత్రమే. ప్రాథమికంగా అసలు వ్యత్యాసం మాత్రం ఏమీ లేదు.

దాంతోపాటు మరో విషయం కూడా గమనార్హం. ప్రతి యుగంలోనూ మానవులు తమ కాలంలో సాధించబడిన అభివృద్ధే మానవుడి లక్ష్యసాధనలో ఆఖరిమెట్టుగా భావించేవారు. కాని కొద్ది కాలం గడిచేసరికే ప్రతి యుగం, అంధకార యుగం అయిపోసాగింది. వెనుకటి తరం వాళ్ళు ఏ అపోహకయితే గురయ్యారో తర్వాతి తరంవారు అదే అపోహకు గురయ్యారు. ఇటీవల గత శతాబ్ది చివరి కాలం వరకూ సైంటిస్టులూ వేదాంతులూ కూడ ఇనుపబండి లేక గాలికంటే బరువుగల వస్తువులు ఆకాశంలో, గాలిలో ఎగరడం అసంభవం అంటూ వచ్చారు. 19వ శతాబ్ది చివరి వరకూ ఇలా జరగడం అసంభవం అని బల్లగుద్ది మరీ చెప్పినవాళ్ళు వున్నారు. కాని కొద్ది కాలంలోనే 1911, 1912 లో ఇనుముతో చేయబడిన బండి గాలిలో ఎగిరింది. అంటే పదీ, పదిహేనేళ్ళ క్రితం ఇలా జరగటం అసంభవం అన్నవారు సత్తెకాలం వాళ్ళు అన్నమాట. అంటే నవయుగం గురించి అభివృద్ధి పథంలో ఆఖరి మెట్టు ఇదే అన్న ప్రజల భావనలు వాదనలూ శుద్ధ అబద్ధాలన్న మాట. ప్రతి యుగంలోనూ మానవుడు తాను సాధించినట్లుగా అభివృద్ధి పథంలో ఆఖరిమెట్టుకు చేరుకున్నట్లుగా భావించాడు. కాని ఆ తర్వాత జరిగిన ప్రయత్నాల వల్ల మరిన్ని మార్గాలు తెరుచుకున్నాయి. మరింత అభివృద్ధి సాధించడం జరిగింది. క్రితం యుగం చీకటియుగం అయిపోయింది. వేదాంతంలోనూ ఇదే ధోరణి, ఇదే పోకడలు కనిపిస్తాయి. ఇంత అన్యాయం మా కాలంలో ఎరగం బాబూ అనేవాళ్ళు ఇప్పటికీ కానవస్తారు. ఈనాడు ఉన్న పరిస్థితీ ఇంత విపరీతం ఈ శతాబ్ద ఆరంభం వరకు ఎరగం అంటున్నారు.

నవయుగం అంటే ఏమిటో బాగా అర్థం చేసుకున్నారుగదా? ఇక నవయువకులు, నవతరం అంటే ఏమిటో చూడండి.

యువకులు స్వయానా మంచికి గానీ చెడుకి గానీ ప్రతిరూపాలు కారు. వేడి రక్తానికి మారుపేరే యువకులు, కొత్త కొత్త విషయాలను ఆకళింపు చేసు

కునే సామర్థ్యం పేరే యువత. ఫలానా పని సాధించ ప్రయత్నించదగ్గదీ అని అనుకోవడమే ఆలస్యం, దాన్ని సాధించేందుకు ప్రాణాలు పణంగా పెట్టే వ్యక్తి పేరే యువకుడు. ఈ ప్రయత్నంలో అది మంచి అయినా సరే, చెడు అయినా సరే, అతడు సాధించి తీర్తాడు. యోధుడికి కత్తి ఎలా ఉపయోగపడుతుందో, గజదొంగకూ అది ఉపకరిస్తుంది. అంటే శక్తికి మారుపేరు యువకులు. ప్రాచీన కాలంలోనూ అరాచక ధ్వజవాహకులు యువకులే. కల్లోలకారకుల సైన్యం వీరే. వీరి ద్వారానే చెడులు వ్యాపించేవి. చెడుల్ని స్వీకరించడంలో వృద్ధులకంటే యువకులే ఎక్కువ చొరవ చూపేవారు. ఇదే పరిస్థితి ఈ కాలంలోనూ వుంది.

ఈ కాలంలో వ్యాపిస్తున్న నైతిక రుగ్మతల్ని అందరికన్నా ఎక్కువగా వ్యాప్తి చేస్తున్నవారు యువకులే. వారిలో అమితమైన చొరవ సృష్టిస్తున్నవారు యువకులే. అంటే యువకులు ఎటువంటి మంచికీ మారురూపాలు కారు. అదేవిధంగా యువకులు చెడుకూ ప్రతిరూపాలు కారు. యువకుల్లో మేలును గ్రహించే సామర్థ్యం వుంది. మేలును గ్రహించిన తర్వాత అది మేలే అన్న సంతృప్తి కలిగాక దానికోసం ప్రాణాలొడ్డటానికయినా వెనుకంజ వేయరు.

ఈజిప్ట్ సంస్కృతీ నాగరికతల్ని చూడండి. యూసుఫ్ అలైహిస్సలాం కాలంలో ఈజిప్ట్ సంస్కృతికీ, ఈనాటి అమెరికా, యూరప్‌ల సంస్కృతికీ ఏమాత్రం తేడా లేదు. కాని హజ్రత్ యూసుఫ్ (అలై) ఒక యువకుడు. ఆయన తన నైతికబలంతో, తన విద్యానైపుణ్యంతో, మేధా పటిమతో ఆ సంస్కృతిని చావుదెబ్బతీశారు. చివరికి ఆ దేశపు పగ్గాలు ఆయన చేతికి వచ్చాయి. "ఆహార నిల్వల్ని నాకప్పగించండి"అని ఆయన చెప్పగానే "ఇదిగో తీసుకోండి" అన్నారు అప్పటివరకు వీటిని నిర్వహించిన వాళ్ళు. అదేవిధంగా దైవప్రవక్త (స) కాలంలో వృద్ధులు ఆయన మార్గానికి ఆటంకాలూ అవరోధాలు కల్పించారు. వాళ్ళు యువకుల్ని పెద్ద సంఖ్యలో సమీకరించి తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. వాళ్ళు దైవప్రవక్త (స)ను ఆయన అనుచరుల్ని అన్నివిధాలా కష్టపెట్టారు. దౌర్జన్యం చలాయించారు. హజ్రత్ బిలాల్(రజి)ను మండుటెండలో ఇసుకలో పొర్లించి ఈడ్చుకెళ్ళినవాళ్ళు మక్కా యువకులే. వృద్ధులు రెచ్చగొట్టిన మీదట

తప్పుడు దారితొక్కారు. కాని రెండోవైపు ధర్మం కోసం అసమాన సాహసం ప్రదర్శించిన దైవప్రవక్త (స) అనుచరులుగా ఎవరు పని చేశారు? వాళ్ళూ యువకులే. దైవప్రవక్త (స)కు ఆరంభంలోని అనుచరుల జాబితా చూడండి! దైవప్రవక్త(స) కంటే రెండేళ్ళుపెద్దవాడయిన అనుచరుడు ఒక్కడు మినహా మిగిలినవారందరూ ఆయనకంటే పిన్నవయస్కులే. ఒకరు పదేళ్ళ బాలుడు. మహాఅయితే 30, 35 ఏళ్ళకంటే తక్కువ వయస్కులు ఉండేవారు. తమ యెదుట అగ్నిగుండం వుందనీ, ఇస్లాం స్వీకరించడం అంటే క్రూరమృగాల్ని "రండి మమ్మల్ని నిప్పుల్లో కాల్చండి" అని ఆహ్వానించడమే, మమ్మల్ని ఈ అగ్నిలోనే వేయండని దుర్మార్గుల్ని ఆహ్వానించడమేనని తెలిసీ వాళ్ళు **లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరే దైవం లేడు)** అని నినదించారు. దాని ఫలితాలు ఎలావుంటాయి? అన్న విషయాన్ని వాళ్ళు ఖాతరు చేయలేదు. ప్రతి జులుంనూ సహించారు. అన్ని కష్టాలనూ అనుభవించారు. మక్కాలో ఈ పని చేయడం కష్టం అని గ్రహించాక స్వదేశాన్ని, ఇల్లు, వాకిలీ, బంధుమిత్రుల్ని అన్నీ వదలి హిజ్రత్ చేశారు తప్ప హిజ్రత్ చేస్తే మనకు ఒరిగేదేమిటి? మన పరిస్థితి ఏమిటి? అని ఆలోచించలేదు. వాళ్ళూ యువకులే. వారిలో స్త్రీలూ వున్నారు అంటే వారు యువ వయస్కులే. వారిలో పురుషులూ వున్నారంటే వారు యువకులే. వారంతా తమ తలలు తాకట్టు పెట్టి ఇస్లామీయ ధ్వజస్థాపన చేశారు. దైవ ప్రవక్త (స)కు సహకరించి శతాబ్దాలపాటు నిలచియుండే మహావిప్లవాన్ని సాధించారు. ఆ విప్లవం ఈనాడూ వుంది. ఇన్షాఅల్లాహ్ ఖియామత్ (ప్రళయం) వరకు దాని ప్రభావం కొనసాగుతుంది. ఇది వారు ధైర్యస్థయిర్యాలతో ప్రాణాలకు సయితం తెగించి చేసిన కృషి ఫలితమే. ఇక గర్వాతిశయంతో ఆధునిక యుగం అని చెప్పుకొనే ఈ యుగాన్నీ చూడండి. ఇది ఉన్నత భావాల యుగమే అయితే ఈ యుగంలో స్థితిగతులేమిటి? ఏ సైన్సు అభివృద్ధి కారణంగా ఇంతగా గొప్పలు చెప్పుకుంటున్నామో ఆ సైన్సే మానవ పతనానికి బీజాలు వేస్తోంది. తల్లీదండ్రుల సంపర్కం వల్ల మానవుడు పుట్టే బదులు టెస్ట్‌ట్యూబ్‌లలో పుట్టించాలని చూస్తున్నారు. మనలాంటి మానవుడ్ని సృష్టించగలమన్న

అభిప్రాయంతో ఇంకా ఏమన్నారో తెలుసా? మనకు ఎటువంటి మనిషి కావాలంటే అటువంటి మనిషిని సృష్టించి సప్లయి చేయగల సమయం రానుంది. ఇదీ గర్వించబడుతున్న సైన్సు స్థితి. ఇది గొప్ప అభివృద్ధి అని ఆకాశానికెత్తేయడం జరుగుతోంది. వాస్తవానికి సైన్సు మనిషిని ఎంత ఉచ్ఛస్థితికి తీసుకెళ్ళిందో అంతే పతనానికీ చేరువ చేసింది. మానవ కళ్యాణానికి తోడ్పడిన దానికంటే ఎక్కువగా మానవ వినాశానికి తోడ్పడింది.

అదే విధంగా ఈనాటి తత్వవేత్తల్ని చూడండి. వారి తత్వాల్లో కానవచ్చే దేమిటి? వాస్తవంలో ప్రాచీనకాలం మనిషి ఎటువంటి మూఢ భావజాలంలో మునిగి ఉండేవాడో అటువంటి మూఢ భావాలే ఈనాడూ కానవస్తున్నాయి. మానవుడి గురించి వాళ్ళ అభిప్రాయంలో మానవుడు ప్రాథమికంగా జంతువుల దశ నుండి పరిణామక్రమంలో అభివృద్ధికి, మార్పులకు గురిఅవుతూ వచ్చాడు. ఇప్పుడు తన గురించి ఆలోచించేటప్పుడు అతని పూర్వీకులు కోతులనీ, గోరిల్లాలనీ, తాను అభివృద్ధి చెందుతూ ఈ దశకు చేరినట్లు భావిస్తే తప్పనిసరిగా అతను తన జీవిత కార్యక్రమాన్ని జంతువుల జీవితాల్లోనే అన్వేషిస్తాడు. అంచేత మీ సోషియాలజీలో జరుగుతున్నది ఇదే. జంతువుల జీవితాల్ని అధ్యయనం చేసి స్వభావం అంటే ఏమిటో తెలుసుకోవటం జరుగుతుంది. వాస్తవానికి మానవ స్వభావానికి జంతువుల స్వభావానికీ, నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా వుంది. ఒకవైపు ఇస్లాం మానవుణ్ని దైవం తన ప్రతినిధిగా పంపాడని చెబుతోంది. మరోవైపు ప్రస్తుత కాలపు ఫిలాసఫీ, సైన్సులు మానవుడితో అంటున్నాయి, నువ్వు జంతువు నుండి పరిణామం చెందుతూ వృద్ధిచెందావు. ప్రాథమికంగా నీకూ పశువుకీ ఏమీ తేడాలేదు. కాకపోతే నీవు నిటారుగా వున్నావు. నీకు అటువంటి కాళ్ళు ఇవ్వబడ్డాయి. ఆకాశంలో నీవు చేసే పనుల్ని జంతువులు చేయజాలవు. ప్రాథమికంగా తాము జంతువులమని జంతువులుగా భావించుకుంటున్నారు. అలా జంతువులుగా భావించుకున్న దాని పర్యవసానంగా ఎప్పుడో వేల సంవత్సరముల క్రితం మజూక్ ప్రతిపాదించిన సూత్రమే ఈనాడు చెలామణి అవుతోంది. అతడు కూడా స్త్రీ, ధనం, భూములను,

మానవుల ఉమ్మడి సొత్తుగా నిర్ధారించాడు. ఈనాడు కూడా అదే సూత్రం పాటించబడుతోంది. స్త్రీ, ధనం, భూములు ఉమ్మడి సొత్తుగా నిర్ధారించే భావనలు రేకెత్తించబడుతున్నాయి. స్త్రీ గురించి మజూక్ పేర్కొన్న భావాలు ఈనాడు యూరప్, అమెరికాల్లో వెళ్ళిచూస్తే ఈ భావం యధాతథంగా కనబడుతుంది. వారి దృష్టిలో ప్రాథమికంగా స్త్రీ పురుషుల్లో ఎలాంటి వ్యత్యాసం లేదు. పురుషుడు కొడుకు కావచ్చు, స్త్రీ తల్లి కావచ్చు. పురుషుడు సోదరుడు కావచ్చు, స్త్రీ సోదరి కావచ్చు. పురుషుడు తండ్రి అయినా స్త్రీ కూతురయినా కావచ్చు. వారిమధ్య ఇప్పుడు ఎటువంటి భేదమూ ఉండదు. కాని సోదరీ సోదరుల సంబంధాలయితే అత్యధికంగా చలామణిలో వున్నాయి. తండ్రీ కూతుళ్ళ సంబంధాలు కూడా ఇప్పుడు అరుదు కావు. కాని ఇప్పుడు వ్యవహారం తల్లీ కొడుకుల సంబంధాల వరకూ వచ్చింది. ప్లేబాయ్ పత్రిక చూస్తే దాన్లో తల్లీ కొడుకుల సంబంధాలకు సంబంధించి ఎన్నెన్ని సంఘటనలు వస్తున్నాయో తెలుస్తుంది. మర్యాదస్తులకు ఉహామాత్రంగానయినా భరింపశక్యంకాని ఇటువంటి నీచ నికృష్ట చేష్టల స్థాయి వరకు మానవుడ్ని పతనం చేయడం జరుగుతుంది. ఇది ఈనాటికీ వ్యాపిస్తూపోవడం మనం చూస్తున్నాం. మనదేశంలో కూడా ఈ సంస్కృతిని దిగుమతి చేస్తున్న ప్రబుద్ధులు వున్నారు. అవే ఆలోచనా విధానాల్ని ఇక్కడ కూడా అంటగడుతున్నారు. వాళ్ళు రూపొందించినటువంటి నైతిక చెడుగులు అమెరికా యూరప్‌లలో లాగే ఇక్కడా అదే దారి పట్టాయి. ఆ దూకుడుకి కళ్ళెం వెయ్యకపోతే, ఆ నైతిక భావనల్ని మార్చకపోతే ఈనాడు అమెరికా యూరప్‌లలో జరుగుతున్న కతల్నే మీరు మీ కళ్ళారా మీ దేశంలో కూడా చూస్తారు అన్నది అసంభవం మాత్రం కాజాలదు.

ఇదే విధంగా మార్క్స్ ప్రతిపాదించిన కమ్యూనిజం, సోషలిజం సిద్ధాంతాలు అభివృద్ధి సాధనకు బహుదొడ్డమైనవిగా కోతలుకోస్తారు. వాస్తవంలో ఆ అభివృద్ధి ఎలాంటిది? అంతకు పూర్వం సంపద, ఆర్థిక ఒనరులు ఎంతోమంది పెట్టుబడిదారుల, పారిశ్రామికవేత్తల, జమిందార్ల చెప్పుచేతల్లో ఉండేవి.

పునర్విభజనకు కావలసిన ఒనరులు వేర్వేరు వ్యక్తుల దగ్గర, అధిక సంఖ్యాకుల చేతుల్లో ఉండేవి. మరి ఇప్పుడో? ఈ సోకాల్డ్ అభివృద్ధి సాధించాక, సమస్త ఒనరులు, యావత్తు భూమి, సకల పరిశ్రమలు, వాణిజ్యం, సంపద కూడబెట్టే సమస్త ఒనరులూ ఇవన్నీ కూడ కొందరి గుప్పెట్లలో ఉన్నాయి. వారికి వ్యతిరేకంగా ఆలోచించే సాహసం ఎవరికీ లేదు. ఒకవేళ ఎవరయినా ఆ విధంగా మాట్లాడినా, ఆ వ్యక్తి తమ సిద్ధాంతాల వ్యతిరేకి అన్న అనుమానం వారికి కలిగినా అతడ్ని పంపేది జైలుకి కాదు పిచ్చాసుపత్రికి. ఆ వ్యక్తి గురించి వారి ఆలోచనా విధానం ఎలా వుంటుందంటే మన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆలోచించగలిగేవాడు ఉన్మాది కాక మరేమవుతాడు? కాబట్టి ఇతడ్ని పిచ్చాసు పత్రికి పంపండి. కమ్యూనిజం బాగా నెత్తికెక్కి సోషలిజం వచ్చిన ఆ దేశాల్లో ఎవరికీ ఎటువంటి స్వాతంత్ర్యమూ లేదు.

సోషలిజం, కమ్యూనిజాల్లో ఉన్న తేడా మాత్రం ఒకటే ఒకటి జబర్దస్తీగా పని చేస్తుంది. రెండోది మేము ప్రజాస్వామ్య మార్గాల ద్వారా వచ్చామని వాదిస్తుంది. లక్ష్యం మాత్రం రెంటిదీ ఒక్కటే. అదేమిటంటే ఉత్పత్తి, ఒనరులు ప్రభుత్వాస్తిగా సమర్పించుకోవాలి. పంపిణి ప్రభుత్వమే చేస్తుంది. ప్రభుత్వం అంటే కానిస్టేబుళ్ళు కాదుగదా. ప్రభుత్వం అంటే కేంద్రంలో కూర్చొని ప్లానింగ్ చేస్తుంది. కేంద్రంలో బైఠాయించి పెత్తనం చలాయిస్తుంది. అంటే ఈ రెండూ కూడా, ప్రపంచంలో ఏనాడూ కానరాని నియంతృత్వాన్ని వీటి గమ్యంగా చేసుకున్నాయి అన్నమాట. షైతాన్ పెద్దపెద్ద ఫిరౌన్‌లనూ, పెద్దపెద్ద నమ్రూద్ లనూ తయారుచేశాడు. ఇప్పుడు రష్యా, చైనా వగైరా దేశాల్లో తయారువుతున్న ఫిరౌన్‌లు, నమ్రూద్‌ల ముందు గతకాలంలోని ఫిరౌన్, నమ్రూద్‌లు దిగదుడుపు అయిపోయారు. ఆ విధానం మనదేశంలోనూ తిష్టవేయాలని కోరబడుతోంది. అందుకోసం తూర్పు నుండి ఎగసిపడుతున్న ఉప్పెనను ఇక్కడకు స్వాగతించడం జరుగుతోందని తెలియపర్చబడుతోంది. ఈ అజ్ఞానపు మాటలన్నీ పురాతన కాలంలోనూ ఉండేవి.

ఇదే విధంగా ప్రాచీన కాలంలో పెద్ద పెద్ద ఫిరౌన్‌లు ఉండేవారని

మీకు తెలుసు కదా! అంతేకాదు గొప్ప గొప్ప క్రూరులు కూడా ఉండేవారు. ఈనాటి క్రూరులు చేయని క్రౌర్యం అంటూ లేదు. వెనుకటి క్రూరసేనులు కూడా చేయని పనుల్ని వీరు చేస్తున్నారు. ఈ బాపతు క్రౌర్యపు పోకడల్ని మీరు మీ కాలంలో స్వయంగా చూస్తున్నారు. అంతా మీ కళ్ళ ముందే జరుగుతోంది. పేరుకు మాత్రం ప్రజాస్వామ్యం నడుపుతున్నామంటారు. ఆచరణలో మాత్రం అంతా నియంతృత్వమే. ప్రజాస్వామ్యం పేరిట, ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వం నడుస్తోంది. దౌర్జన్యంగా ఎన్నికల్లో గెలిచే కళ పరిపూర్ణం చేయబడింది. తమకు వ్యతిరేకంగా గెలిచే అవకాశం ఎవరికీ ఏమాత్రం లేకుండా చేసేశారు. ఈ కళ సంపూర్ణంగా తీర్చిదిద్దబడింది. మరి దీన్ని ఉత్థానం అందామా? పతనం అందామా? ఇదయితే ఫిరౌన్, నమ్రూద్‌ల కాలంలోకి తిరోగమనమే. ఆ ఫిరౌన్, నమ్రూద్‌లకే కాదు, వాళ్ళ తాతముత్తాతలకు తోచియుండని విధంగా ఈనాటి ఫిరౌన్‌లు, నమ్రూద్‌లు ప్రవర్తిస్తున్నారు.

గతకాలంలో ఈజిప్ట్‌లో నాసర్ ప్రభుత్వం చేసిన హింసా దౌర్జన్యాల వాస్తవాలు ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి. అక్కడ ఎటువంటి హింసా అరాచకాలు జరిగాయో అవగతమవుతోంది. ఇది ఈనాడు మనముందు వున్న సవాలు. ఒక ఛాలెంజ్. ఈ అజ్ఞానాన్ని ఎదిరించి నిలువరించేవాళ్ళు ఈ ప్రపంచంలో ఉన్నారా? అన్న ప్రశ్న ఎదురవుతోంది. తద్వ్యతిరేకంగా మానవ వినాశానికికాక మానవ కళ్యాణానికి పనికొచ్చే సైన్సును ఉనికిలోకి తేవాలి. మనిషిని మృగంగాకాక మనిషిని మానవునిగా చేసే సిద్ధాంతకారులు ముందుకురావాలి. మనిషిని జంతువుల స్థాయికి దిగజారకుండా ఆపే, అత్యుత్తమ సృష్టిశ్రేష్టునిగా తీర్చిదిద్దే ఉత్తమ నీతిమంతులు కావాలి. ఈ నవయుగం విసిరే ఛాలెంజ్ ఇది.

ఎలా ఎదుర్కోవాలి?

ఈ ఛాలెంజ్‌ని ఎదుర్కునేందుకు రెండు వస్తువులు తప్పనిసరిగా కావాలి. ఒకటి: అల్లాహ్ మరియు దైవప్రవక్త (స) శిక్షణలు, బోధనల్ని అర్థం చేసుకోవాలి. వాటిని మనస్ఫూర్తిగా స్వీకరించాలి. వాటినే జీవితాశయాలుగా

చేసుకోవాలి. వాటిని ప్రపంచ వ్యాప్తం చేసే కృషి చేపట్టాలి. అలా చేస్తే దైవవాక్కు ఉన్నతం అయి మిథ్యావాదాలు, బూటకపు సిద్ధాంతాలూ తలలు వాల్చు కుంటాయి. ఇందుకోసం దీక్ష పూనండి, నడుంకట్టి నడవండి. ఇది మొట్ట మొదటి విషయం. రెండోది: అజ్ఞానాన్ని పాటించే వాళ్ళూ, దాన్ని వ్యాపింపచేసే వాళ్ళూ చివరకు పరాజితులయ్యేందుకు మీ దగ్గర నైతికబలం ఉండాలి. ఒక్క విషయం గుర్తుంచుకోండి. అజ్ఞానులు, అజ్ఞాన ధ్వజవాహకుల దగ్గర ప్రాథమిక ఒనరులు 95 శాతం ఉండీ, ధర్మావలంబీకులు, ధర్మధ్వజవాహకుల వద్ద కేవలం 5 శాతం ఒనరులే వుంటే ధర్మధ్వజవాహకులు కేవలం తమ ధర్మబద్ధ వ్యవస్థలోని సత్యత, సవ్యతల కారణంగా, తమ నైతికబలం ఆధారంగా వారిని జయించవచ్చు. అంతేకాదు ఆ ఒనరులు 5 శాతం కూడా లేకుండా కేవలం ఒక్కశాతం మాత్రమే ఉన్నా ఇన్షా అల్లాహ్ మీరే ఆధిక్యత పొందగలరని నేను వక్కాణిస్తున్నాను. అయితే ఒక్క షరతు. ఒక వైపు విశ్వాసబలం, రెండో వైపు నైతికబలం మీ దగ్గర ఉండాలి. దైవ ప్రవక్త (స) 23 సంవత్సరాల వ్యవధిలోనే ఒక జాతినంతటినీ మార్చివేశారు. ఒక దేశాన్నే లొంగదీసుకున్నారు. దాని వైశాల్యం లక్షల చ.మైళ్ళు. బందిపోట్లను అమానతుదార్లుగా, దైవభయం లేని వారిని అత్యంత భయభక్తులు కలవారిగా తీర్చిదిద్ది, ప్రజాకంటకులను ప్రజల పాలిట కారుణ్యంగా ప్రజల జీవితాల్లో బ్రహ్మాండమయిన విప్లవం సాధించారు. మానవ కారుణ్యమూర్తి (స) కేవలం 23 సంవత్సరాల స్వల్పవ్యవధిలో సాధ్యమయిన విప్లవం ఇది.

ఇదెలా సాధ్యం?

దైవప్రవక్త (స) తెచ్చిన ధర్మం పటిష్టమయిన ఆధారాలతో, సహేతుకంగా సలక్షణంగా ముందుకు వచ్చేసరికి దాన్ని ఎదుర్కొనేందుకు అధర్మం వద్ద ఎటువంటి ప్రశ్న లేకపోయింది. చివరకు తీవ్రవ్యతిరేకులు సయితం ఈ ధర్మాన్నే అంగీకరించవలసి వచ్చింది.

రెండో విషయం : ఆయన (స), ఆయన అనుచరుల ఉన్నత నైతికతలు ప్రజల హృదయాల్ని చూరగొన్నాయి. దైవప్రవక్త (స)కాలంలో జరిగిన

యుద్ధాలలో ప్రాణనష్టం మూడు వందలకులోపే అంటే మీకు ఆశ్చర్యం కలగక మానదు. దాన్ని రక్తపాత రహిత విప్లవం (Bloodless Revolution)అనవచ్చు. 23 ఏళ్ళలో మూడువందల మంది మాత్రమే చంపబడ్డారు. ఒక దేశమంతటా విప్లవం లేవదీయబడింది. విప్లవం అంటే కేవలం ప్రభుత్వ విప్లవం కాదు. నైతికత, ఆధ్యాత్మికతల విప్లవం. మానవత్వ విప్లవం లేవదీయబడింది. అంటే దీన్ని రక్తపాత రహిత విప్లవం అనవచ్చు. ఇది నైతిక బలంతో సాధించబడిన విప్లవమే తప్ప కత్తులు దూసి సాధించిన విప్లవం కానేకాదు. ముహమ్మద్ (స) సెలవిచ్చిన ధర్మం ఈనాటికీ యధాతథంగా ఉంది. పవిత్ర ఖుర్ఆన్‌లోనూ ఉంది. దైవప్రవక్త(స)సున్నత్‌లో, ఆయన (స) హదీసులలో, ఆయన(స) ఆచరణలో, ఆయన(స) సహాబా(రజి) అనుకరణలో, వీటన్నింటిలోనూ యధాతథంగా వుంది. దానిలో మార్పుచెందినది గాని, చెరుపబడిందిగాని ఏమీ లేదు. అది ఏ కొద్ది మాత్రంగానైనా మార్పుకు మార్చివేతకు గురికాలేదు. ఏ ఆధారాలతో ఇస్లాం ప్రతిపాదించబడిందో ఆ ఆధారాలతోనే మీరూ సమాయత్తంకండి. విజ్ఞానపరంగా ఈ ధర్మానికి సాటివచ్చే విధంగా మీకు వ్యతిరేకంగా ఎటువంటి ఫిలాసఫీనిగానీ, ఎటువంటి సిద్ధాంతాన్ని గానీ ఎవరూ తేలేరు. అయితే ఒక్క విషయం, అందుకోసం మీరు మిమ్మల్ని సమాయత్తపర్చుకోవాలి. దాంతోపాటు మీ మేధాశక్తిని జోడించి దాన్ని పూర్తి శక్తితో, సకల సాక్ష్యాధారాలతో ఇంకా ఈనాడు లభించే సైన్సు, ఫిలాసఫీ తదితర ఆధారాలతో కలగలసి ప్రపంచ మేధావులు మీకు లోబడే విధంగా ప్రతిపాదించండి. ధర్మం అంటే ఇదే, ఇది తప్ప మరో ధర్మం లేదు. మానవ శ్రేయస్సు ఈ ధర్మంలోనే ఇమిడివుంది అని సకల ప్రపంచం ఒప్పుకోకతప్పదు.

ప్రస్తుత పరిస్థితులు ఎలా వున్నాయంటే అమెరికా, యూరప్‌లలో తమ ధర్మాన్నే వ్యతిరేకిస్తున్నవారు, దైవవ్యతిరేకులు, పరలోక తిరస్కారులు, చర్చి వ్యతిరేకులు చర్చిలను దాదాపుగా పాడుపెట్టారు. ఆ కారణంగా చర్చిలు అమ్ముడుబోతున్నాయి, విక్రయించబడుతున్నాయి. ఇంకా కొన్ని చర్చిల అధ్యాపకులు, పాదరీలు పిచ్చాసుపత్రులకు చేరుతున్నారు. వారిని మీ మానసిక సమతులనం ఎందువల్ల చెడిపోయిందీ అని ప్రశ్నిస్తే వారిచ్చే జవాబు, "మేము

ప్రచారం చేసే దాన్ని మేమే విశ్వసించము. బలమైన మానసిక సంఘర్షణ మా మతులు పోగొట్టింది."

ఈ యూరప్, అమెరికాలలోనే ఇస్లాం గురించి వాస్తవ బోధనలను గురించి తెలుసుకొన్నప్పుడు వారిలో ఇస్లాం పట్ల చారిత్రక విద్వేషం ఉన్నప్పటికీ ప్రజలు ముందుకు వచ్చి ఇస్లాం బోధనలను అంగీకరిస్తున్నారు.

శిలువ యుద్ధాల కాలంలో ఇస్లాంకు వ్యతిరేకంగా, ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా, పవిత్ర ఖుర్ఆన్‌కు వ్యతిరేకంగా జరిగిన విద్వేష ప్రచార ప్రభావం ఇప్పటికీ నెలకొనివుంది. ఈ కారణం చేత యూరప్, అమెరికాలలోని క్రైస్తవులు తమ ధర్మంపై విరక్తి కలిగి ఇతర మతాలపై దృష్టి సారించినప్పుడు బౌద్ధమతం గురించి అధ్యయనం చేస్తారు, హిందూ మతాన్ని అధ్యయనం చేస్తారు, ఇంకా ఇతరత్రా మతాల గురించి కూడా స్టడీ చేస్తారు. ఇవేవీ వారికి సంతృప్తి కలిగించకపోతే, వారి తృష్ణను తీర్చకపోతే చివరకు తప్పనిసరిఅయి ఇస్లాంను అధ్యయనం చేస్తున్నారు. ఇస్లాం పట్ల ఆకర్షితులవుతున్నారు. అంటే ఆ సిద్ధాంతాలలో, ఆధారాలలో నేటికీ చేవ, బలం వున్నాయి అన్నమాటే గదా. కాబట్టి మీరు ఆ సిద్ధాంతాలనే చేతబూని బరిలోకి దిగండి. వాటిని విశ్వవ్యాప్తం చేసే కృషిసల్పండి. ప్రపంచ ప్రజల ముందుకు వెళ్ళండి. మీ ఈ దేశంలోనే నాస్తికులు అసంఖ్యాకంగా వున్నారు. వారిని మీరు మార్చగలరు. వారి మతాన్ని, వారి భావాల్ని మీరు మళ్ళించగలరు. మీ దగ్గరున్న ఆధారాలతోనే కమ్యూనిస్టులను ప్రభావితులు చేయగలరు. మానవ శ్రేయస్సు కొరకు కమ్యూనిజం, సోషలిజాలు సాధించలేని కార్యాన్ని ఇస్లాం సాధించగలదని మీరు వారికి నచ్చచెప్పగలరు. ఇదే విధంగా మీరు మీలో ప్రజాహృదయాలను చూరగొనేటటువంటి నైతికతను అలవర్చుకోండి. ఈ దేశంలో తిట్లు దూషణలు పెచ్చుపెరిగాయి. చిన్నవారి నుండి పెద్దవారి దాకా, సాధారణ పౌరుల నుండి విద్వాంసుల వరకూ నిస్సంకోచంగా తిట్లు, దూషణలకు పాల్పడుతున్నారు. మీరు తిట్లకు దూరంగా వుండాలి. ఎవరయినా మిమ్మల్ని తిడితే జవాబుగా మీరు తిట్టకూడదు. మీతో జగడమాడేవారి పట్ల మీరు మర్యాద, మానవత్వాల్ని ప్రదర్శించండి. మీ పట్ల చెడుగా వ్యవహరించిన వారి పట్ల మీరు మంచిగా వ్యవహరించండి. ఆ తర్వాత

ఇక చూడండి. మీకు ఎదురేవుండదు. మీ బద్ధ శత్రువులు తమ స్థానం నుండి తప్పుకోకపోవచ్చు. కాని వారు ఎంతగా ఎందరిని భ్రష్టు పట్టించారో, ఎందరిని మీకు వ్యతిరేకంగా మీపై దురభిప్రాయం ఏర్పరచారో వారు మీ నడవడికను కూడా గమనిస్తారు. మీ బుద్ధుల్ని చూస్తారు. మీ నైతికతను గమనిస్తారు. చివరకు మీకు వ్యతిరేక ప్రచారం చేస్తున్న వారినే అబద్ధాల కోరులుగా, మిమ్మల్ని సత్యవంతులుగా, ముస్లింలకు ఉండవలసిన సదాచరణ మీలో కనబడుతోందని ఒప్పుకుతీర్తారు.

మీ ఆయుధాలు ఈ రెండు వస్తువులే. మీరేగనక ఈ రెండు ఆయుధాలను ధరిస్తే మీ సంఖ్య దేశ జనాభాలో 1 శాతం కూడా లేకపోయి నప్పటికీ మీరే ప్రపంచాన్ని లోబర్చుకోగలరు, శాసించగలరు. ఇదే విధంగా సమస్త వనరులూ, ప్రచార సాధనాలూ మీ శత్రువుల చేతుల్లో వున్నా పర్వాలేదు. రేడియో వారి స్వాధీనంలో వున్నప్పటికీ, టెలివిజన్ వారి చెప్పుచేతుల్లో వున్నప్పటికీ, ప్రెస్, సమాచార వ్యవస్థల్లో వారు చొచ్చుకుపోయి, సైన్యం, పోలీసు యంత్రాంగం వారి అడుగులకు మడుగులొత్తుతూ ఉన్నా, చట్టాలూ న్యాయ స్థానాల్లో వారు తిష్టవేసుక్కూర్చున్నా మీరు అవేవీ లక్ష్య పెట్టనవసరం లేదు. అవన్నీ వారి చేతుల్లో వుండగానే మీరు వారిని ఓడించగలరు. అయితే ఈ రెండు ఆయుధాలూ మీ చేతిలోవుండాలి. ఈ రెండు ఆయుధాలతోనే దైవప్రవక్త ముహమ్మద్(స) ఒంటరి పోరాటం జరిపి అరబ్ దేశాన్నంతటినీ వశపర్చు కున్నారు. ఇంకా అరేబియాను వశపర్చుకున్న దరిమిలా ఇస్లాంకు బ్రహ్మాండ మయిన పరిపుష్టిని కలగించి, ఆ శక్తి ఒక వైపు చైనా సరిహద్దులు లగాయతు రెండో వైపు స్పెయిన్ మరియు పశ్చిమాసియా వరకు ప్రపంచంలోని పెద్ద భూభాగానికి విస్తరించేలా చేశారు. ఇదంతా కూడా ఎంత స్వల్ప వ్యవధిలో జరిగిందంటే అటువంటి విప్లవం చరిత్రలో ఏనాడూ చోటుచేసుకోలేదు. నభూతో నభవిష్యతి అన్న విధంగా విప్లవించారు. నేటికీ అది సాధ్యమే. దైవప్రవక్త (స)కు ఇంతటి విజయం సాధించిన దైవచట్టాలు నేటికీ మారలేదు, అవే దైవచట్టాలు. వాటిలో ఏ మార్పూ సంభవించలేదు. వివిధ వస్తువుల గుణాలు వాటి ప్రభావం

ఆనాడు ఏ విధంగా ఉండేవో ఈనాటికీ అలాగే వున్నాయి. చెడుకీ కొన్ని ప్రభావాలు ఉన్నాయి. అవి ప్రాచీన కాలంలోనూ వుండేవి. ఈనాడూ వున్నాయి. మంచికీ కొన్ని ప్రభావాలు ఉన్నాయి. అవి ప్రాచీన కాలంలోనూ వుండేవి. ఈ కాలంలోనూ వున్నాయి. మీరు దైవప్రవక్త (స) అవలంబించి, తమ సహాబా(రజి)లలో పెంపొందించిన మేలును అవలంబించండి. వాటి ప్రభావం, పరిణామాలు ఆనాడు ఏ విధంగా వుండేవో ఈనాటికీ అవే పరిణామాల్ని మీరు చూస్తారు. అదే విధంగా సత్యధర్మాన్ని పటిష్టమయిన ఆధారాలతో, తిరస్కరించ వీలు లేని ఆధారాలతో మనస్సులనాకట్టుకునే సాక్ష్యాధారాలను ప్రతిపాదిస్తే, మీకు లభించే ప్రతి భాషలోనూ ప్రతిపాదించినట్లయితే, సమస్త ఒనరులూ మీ శత్రువుల చేతుల్లో వున్నప్పటికీ మీరు కేవలం మీకున్న ఆధారాలతో ప్రజాస్పందన మీ వైపు కావడాన్ని మీరే చూస్తారు. మీకు వ్యతిరేకులుగా వున్న వారే మీ అనుచరులుగా, సహచరులుగా, మిమ్మల్ని బలపర్చేవారుగా మారిపోగలరు. మీరు వేరుగా సైన్యాన్ని సమీకరణ చేయనక్కరలేదు. సైన్యమే మీకు లోబడి మీ వెంట నడుస్తుంది. మీరు వేరే ఆయుధాలను సమకూర్చుకోవలసిన అవసరంరాదు. కాలేజీలు, యూనివర్సిటీలను ఇతరులు స్థాపిస్తారు. వాటిల్లో చదివే విద్యార్థుల్ని మీకు అనుగుణంగా మల్చుకొని వారిని వినియోగించుకోవచ్చు. మీరు సైంటిస్టులను ఎక్కణ్ణుంచో తెచ్చుకొనే పనిలేదు. ప్రస్తుతం ఉన్న సైంటిస్టులనే మార్చండి. వారి ఆలోచనా విధానాన్ని మార్చండి. వారి సైంటిఫిక్ విజ్ఞానం మీకు అక్కరకు రాగలదు. ఇదే విధంగా ముహమ్మద్ (స) మరియు దివ్యఖుర్ఆన్ నేర్పిన మానవ వశీకరణ విద్యను మీరు అభ్యసించండి. ఆ తర్వాత మీరే చూస్తారు. ఇదంతా నా కళ్ల ముందు జరుగు తుందో లేక నా తర్వాత పదేళ్ళకో, వందేళ్ళకో సాధ్యపడుతుందని నేను చెప్పలేను. కాని ఆ వశీకరణాశక్తిని వినియోగిస్తే ప్రపంచమే మీకు వశమవుతుందని ఘంటాపథంగా చెప్పగలను.

-:సమాప్తం:-